సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం। 19। జనవరి। 2023



ప్రమాదాల నివారణపై అవగాహన 8లో



కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు 8లో



బుడియాల సందడి

అనంతగిరి మండలం డముకు వారపు సంతలో బుడియాలు సందడి చేశారు. విచిత్ర వేషధారణలతో అలరించారు. వారిని అందరూ ఆసక్తిగా తిలకించారు.

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మితో విదేశీ ప్రతినిధుల భేటీ



ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మితో పలు దేశాల ప్రతినిధులు

సాక్షి,పాడేరు: లవ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు ఏసుపాదం ఆధ్వర్యంలో అమెరికా, జర్మనీ, న్యూజిలాండ్ దేశాలకు చెందిన ప్రతినిధులు మంగళవారం రాత్రి భేటీ అయ్యారు. పాడేరులోని తన నివాసానికి చేరుకున్న విదేశీ ప్రతినిధులకు ఎమ్మెల్యే ఘన స్వాగతం పలికారు. గిరిజన ప్రాంతాల్లో లవ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు పాల్గొన్నారు.

చింతూరు ఇన్‌చార్జి పీవోగా సూరజ్ గనోరే



చింతూరు: రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరేకు చింతూరు డివిజన్ ఇన్‌చార్జి సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవోగా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు జారీచేశారు. ఇప్పటివరకు ఇక్కడ సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవోగా పనిచేసిన ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఇటీవల అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. దీంతో ఆ రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో సూరజ్‌గనోరేకు ఇంఛార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా షాపు దగ్ధం

రూ.3లక్షల ఆస్తినష్టం



షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన కిరాణా దుకాణం

సాక్షి,పాడేరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంగళవారం రాత్రి గుత్తులపుట్టు సంతబయలులో సంభవించిన అగ్ని ప్రమాదంలో కిరాణా దుకాణం దగ్ధమైంది. దుకాణం యజమాని చుక్క అర్జున్ రాత్రి 9 గంటల సమయంలో మూసివేశాడు.అయితే రాత్రి 11గంటల సమయంలో దుకాణం నుంచి మంటలు రావడంతో హుటాహుటిన విద్యుత్ లైన్‌ను నిలిపివేశారు. స్థానికులంతా మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే దుకాణంలోని మూడు ఫ్రిజ్‌లు, కిరాణా సామగ్రి బూడిదయ్యాయి.సుమారు రూ.3లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు అర్జున్ తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

- అరకు ఎంపీ గొడ్డేటి మాధవి
- వాలీబాల్ కిట్ల పంపిణీ



వాలీబాల్ కిట్లను పంపిణీ చేస్తున్న అరకు ఎంపీ మాధవి

కొయ్యూరు: గిరియువకులు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. బుధవారం శరభన్నపాలెంలో చింతలపూడి, వైఎన్ పాకల యువకులకు ఆమె వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఇందుకు ఆమె సొంత నిధులను వెచ్చించారు. నేనుసైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టపడి కాకుండా ఇష్టపడి చేస్తే విజయంవైపు నడిపిస్తుందని చెప్పారు. ప్రతిఒక్కరు ఇష్టమైన రంగాలపై దృష్టి పెడితే లక్ష్యాన్ని సునాయాసంగా సాధించవచ్చన్నారు. డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

18 మండలాలు.. 2,676 గ్రామాలు..

- జిల్లావ్యాప్తంగా చురుగ్గా భూరీసర్వే
- ఇప్పటి వరకు 274 గ్రామాల్లో పూర్తి
- గోగుమిల్లిలో గిరి రైతులకు హక్కు పత్రాల పంపిణీ

రైతుల భూములకు భవిష్యత్తులో ఎటువంటి వివాదాలకు తావులేకుండా ఉండేందుకు ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం సర్వే జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా జరుగుతోంది. జిల్లాలోని 18 మండలాల్లో 274 గ్రామాల్లో 70,538 ఎకరాలకు రీ సర్వే పూర్తిచేసిన అధికార యంత్రాంగం మిగతా 2,676 గ్రామాల్లో రీసర్వే వేగవంతం చేసింది.



రైతులకు అందజేసిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు పాసు పుస్తకం

రంపచోడవరం: జిల్లా విభజన జరగక ముందు అప్పటి తూర్పుగోదావరి జిల్లాలో సమగ్ర భూ సర్వేకు రెండు గ్రామాలను ఎంపిక చేశారు. ఒకటి పెద్దాపురం, రెండు రంపచోడవరం మండలం గోగుమిల్లి. గోగుమిల్లిలో భూములకు రీసర్వే పూర్తి చేశారు. భూ హద్దులు తెలిపే రాళ్లను ఏర్పాటుచేశారు. రీసర్వే ద్వారా ఆన్‌లైన్ చేసిన భూముల రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు.

విలీన మండలాలకు మినహాయింపు

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా జిల్లాలో 18 మండలాల్లోని 2,676 గ్రామాల్లోని భూములను రీ సర్వే చేస్తున్నారు. జిల్లాలో 22 మండలాలు ఉండగా విలీన మండలాలైన చింతూరు, వీఆర్ పురం, కూనవరం, ఎటపాక పోలవరం ప్రాజెక్టు ముంపులో ఉండడంతో వాటిని మినహాయించారు.

274 గ్రామాల్లో రీసర్వే పూర్తి

జిల్లాలో ఇప్పటివరకు 274 గ్రామాల్లో 70,538 ఎకరాలకు రీ సర్వే పూర్తి చేశారు. మిగతా భూములను 44 బృందాలు సర్వే చేస్తున్నాయి. ఒక్కో బృందంలో పది మంది సభ్యులు ఉన్నారు. వీరు డిజిటల్ గ్లోబల్ పొజిషన్ సిస్టమ్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నారు. ఇందుకు 77 మెషీన్లు వినియోగిస్తున్నారు.

- ఏజెన్సీ ప్రాంతంలో బ్రిటిష్ కాలంలో భూములకు సర్వే చేశారు. తరువాత కాలంలో ఎప్పుడు సర్వే జరగలేదు. రంపచోడవరం డివిజన్‌లో రంపచోడవరం, అడ్డతీగల, గంగవరం మండలాలలో గ్రామ సభలు ఏర్పాటు చేసి, భూములు రీ సర్వే చేస్తున్నారు. సర్వే చేసిన భూములన్నిటికీ హద్దులు ఏర్పాటు చేసి సర్వేకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు.



గోగుమిల్లిలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

గిరిజనులకు ఎంతో మేలు

సమగ్ర భూసర్వేతో ఏజెన్సీలో గిరిజనులకు ఎంతో ప్రయోజనం ఉంది. కుటుంబ యాజమాని పేరు మీ ద ఎక్కువ భూమి ఉండటం వల్ల అనేక ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారు. సమగ్ర భూ సర్వే ద్వారా మ్యుటేషన్ చేసుకునే అవకాశం ఉండడంతో తండ్రి నుంచి పిల్లలు, అన్నదమ్ములు వారి వాటా భూములకు హక్కులు పొందే అవకాశం ఏర్పడుతోంది.

హక్కు పత్రాలిస్తాం

భూహక్కు, భూ రక్ష పథకంలో రైతులకు సంబంధించిన భూములకు సర్వే చేసి హక్కు పత్రాలు పంపిణీ చేస్తాం. గోగుమిల్లిలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన సర్వే పూర్తయింది. రైతులకు పట్టాలు ఇచ్చాం. అదే మాదిరిగా ఏజెన్సీ అంతటా రైతులకు పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

–శుభం బన్సల్, సబ్ కలెక్టర్, రంపచోడవరం

మ్యుటేషన్ ప్రక్రియ వేగవంతం

- లేకుంటే షోకాజ్ నోటీసులు
- కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరిక

సాక్షి,పాడేరు: మ్యుటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని లేకుంటే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం తన కార్యాలయం నుంచి అన్ని మండలాల రెవెన్యూ అధికారులతో వీడియో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యుటేషన్ ప్రక్రియలో వెనుకబడి ఉన్నామన్నారు. రోజుకు నాలుగైదుకు మంచి మ్యుటేషన్లు ఉండవని, అయినప్పటికి అప్రూవల్ చేయడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని తహసీల్దార్లను ఆయన ప్రశ్నించారు. భూముల రీసర్వేపై మండల సర్వేయర్లు దృష్టి సారించాలని, నెలాఖరుకు 150 గ్రామాల్లో లక్ష్యం పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ భూములను సాగుచేస్తున్న గిరిజనులకు డిఫారం పట్టాల పంపిణీకి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. స్పందన సమస్యలు పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని, సెల్‌టవర్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పాడేరు సబ్‌కలెక్టర్ వి.అభిషేక్, సర్వేశాఖ ఏడీ మోహనరావు పాల్గొన్నారు.

గిడ్డంగుల నిర్మాణానికి ప్రతిపాదనలు

గిరిజన వ్యవసాయ,అటవీ ఉత్పత్తులను నిల్వ చేసేందుకు గిడ్డంగుల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.తన సమావేశమందిరంలో బుధవారం వ్యవసాయ, ఉద్యానవన, జీసీసీ, మార్కెటింగ్, అటవీశాఖ, స్పైసెస్ బోర్డు, పౌరసరఫరాలశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు వారపుసంతలను సందర్శించి, సంత ప్రదేశాలకు దగ్గరగా గిడ్డంగుల నిర్మాణానికి భూములను గుర్తించి నివేదికలు ఇవ్వాలన్నారు. సంతల్లో గిరిజనులు విక్రయిస్తున్న ఉత్పత్తుల ధరలపై అధ్యయనం చేయాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, గిరిజన రైతులకు ప్రయోజనం చేకూరే లక్ష్యంతో పనిచేయాలన్నారు. జీసీసీ గిడ్డంగులపైన ఆయన ఆరా తీశారు. ఈ సమావేశంలో జేసీ శివశ్రీనివాస్, డీఎఫ్‌వో వినోద్‌కుమార్, కాఫీ బోర్డు మినుములూరు ఎస్‌ఎల్‌వో విష్ణు, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి నందు, పౌరసరఫరాల డీఎం గణేష్‌కుమార్, జీసీసీ డీఎం పార్వతమ్మ, ఐటీడీఏ పీహెచ్‌వో అశోక్, స్పైసెస్ బోర్డు ఫీల్డ్ అధికారి కల్యాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జల్‌జీవన్ మిషన్‌లో చేపట్టిన తాగునీటి పథకాల నిర్మాణాల్లో పటిష్టమైన నాణ్యత ప్రమాణాలను పాటించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన సూచనలు చేశారు. తాగునీటి పథకాల నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. పైపులు వేసినంత మాత్రాన పనులు పూర్తయినట్టు కాదని, బోరుబావులు, ట్యాంకుల నిర్మాణాలను చేపట్టి, ఆయా గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లకు అప్పగించిన పనులను వేగవంతంగా పూర్తి చేయించడంతో పాటు, పూర్తయిన పనులకు బిల్లులు కూడా చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఉద్యోగులు రుపొందించిన 2023 వార్షిక డైరీని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈఈ లీలాకృష్ణ, డీఈఈలు ప్రకాష్, జయరాం, గోపాలకృష్ణ, రుక్మాంధరరాజు, చంద్రకిరణ్, జేఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.



ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం

రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్

అడ్డతీగల: జాతీయ రహదారి 516ఇలో భూములు కోల్పోతున్న యజమానులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం తగిన పరిహారం ఇస్తామని రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు.రాజమహేంద్రవరం నుంచి విజయనగరం జిల్లా గరివిడి వరకూ నిర్మించనున్న జాతీయ రహదారి 516ఇ పరిధిలో భూములు కోల్పోతున్న భూయజమానులతో గ్రామపంచాయితీల వారీగా రెవెన్యూ అధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా అడ్డతీగల ప్రాంత భూయజమానులతో బుధవారం అడ్డతీగల గ్రామసచివాలయం-2లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ రహదారి నిర్మాణానికి సూచించిన విధంగా ఆయా భూముల గుండా రహదారి వెళ్లేమార్గంలో సిమెంటు దిమ్మలు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ఆయా సరిహద్దుల పరిధిలో భూయజమానులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారాన్ని మంజూరు చేస్తామన్నారు. అందుకు అవసరమైన డాక్యుమెంట్లతో ఆధారాలు అందజేయాలని ఆయన సూచించారు. తహసీల్దార్ సీహెచ్‌శ్రీనివాసరావు, అడ్డతీగల సర్పంచ్ పప్పుల చిట్టమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. భీముడుపాకలు గ్రామపంచాయితీ కార్యాలయం వద్ద జాతీయ రహదారిలో భూములు, ఇళ్లు కోల్పోతున్న యజమానులతో మాట్లాడారు.



అడ్డతీగల సచివాలయంలో మాట్లాడుతున్న రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సల్

మత్స్యగెడ్డలో గల్లంతైన వ్యక్తి మృతి

పెదబయలు: మండలంలోని చేపల వేటకు వెళ్లి గల్లంతైన గంపరాయి పంచాయతీ కుల్లుభ గ్రామానికి చెందిన వంతాల నీలకంఠం (32) మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 17 సాయంత్రం వంతాల నీలకంఠం, ఇదే గ్రామానికి చెందిన బొంజుబాబు బంగారుపుట్టు గ్రామ సమీపంలోని మత్స్యగెడ్డకు చేపలవేట నిమిత్తం వెళ్లారు. వీరిలో నీలకంఠం ప్రమదవశాత్తూ కాలుజారి గెడ్డలో పడి గల్లంతయ్యాడని ఎస్‌ఐ తెలిపారు. మంగళవారం నుంచి గాలిస్తుండగా అతని మృతదేహం బుధవారం లభ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇలావుండగా మృతుని భార్య గర్భవతి. ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. కుటుంబ యజమాని మృతితో వారి పరిస్థితి దయనీయంగా మారింది.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో మెరుగైన వైద్యం

జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన బాధితుడు

దేవీపట్నం: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సందూరి గంగాధరరావు బుధవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఇటీవల అనారోగ్యానికి గురవడంతో కాలుకి శస్త్ర చికిత్స చేయాల్సివచ్చింది. ఈ విషయం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సుమారు రూ.5లక్షల ఆర్థికసాయం అందించారు.దీంతో హైదరాబాదులో మెరుగైన వైద్యం పొందారు. కోలుకున్న నందూరి బుధవారం తాడేపల్లిలో సీఎం క్యాంప్ ఆఫీస్‌లో ముఖ్యమంత్రిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారని నందూరి తెలిపారు.



తాడేపల్లిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలుపుతున్న గంగాధరరావు

పాడేరు టీడీపీలో వర్గపోరు

- బయటపడిన విభేదాలు
- వేర్వేరుగా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు

సాక్షి,పాడేరు: పాడేరు నియోజకవర్గంలో టీడీపీలో వర్గవిభేదాలు చోటుచేసుకున్నాయి. ఎన్టీఆర్ వర్ధంతిని బుధవారం నియోజకవర్గ కేంద్రమైన పాడేరులో టీడీపీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి వేర్వేరుగా నిర్వహించారు. పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తన అనుచరులతో కలిసి స్టేట్‌బ్యాంకు ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె ఆధ్వర్యంలో కొంతమంది టీడీపీ నేతలు జిల్లా ఆస్పత్రిలో రక్తదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి వ్యతిరేక వర్గం వేరుగా నిర్వహించింది. మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ అనుచరులతో కలిసి ఇదే ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. వారు కూడా రక్తదానం శిబిరం నిర్వహించారు. టీడీపీలో రెండు వర్గాల పోరు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో బహిర్గతమయ్యాయి.



పాడేరులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి మణికుమారి,కాంతమ్మ

కాఫీ రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అనంతగిరి: అనంతగిరి, అరకు కాఫీ రైతులను ప్రోత్సహించి, ఆర్థికంగా ఎదిగేందుకు తనవంతు కృషిచేస్తానని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని భీసుపురం గ్రామంలోని కాఫీ గింజలను కాఫీ పౌడర్ తయారీ యంత్రాలు, కాఫీ పౌడర్ ప్యాకింగ్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం కాఫీని రుచి చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులకు ప్రోత్సహిస్తే మరింత ఎదుగుతారన్నారు. అందుకు అవసరమైన సహకారం ప్రభుత్వం నుంచి అందేలా కృషి చేస్తానన్నారు. డ్వాక్రా మహిళలకు వెలుగు ద్వారా రుణాలను మంజూరు చేయాలని ఏపీఎం సూర్యారావుకు సూచించారు. ఇప్పటికే కాఫీ పౌడర్ తయారుచేసే యంత్రాలు కొనుగోలు చేసేలా రెండు గ్రూపులకు హెచ్‌ఈవోలో రూ.20 లక్షలు మంజూరు చేశామని ఆయన తెలిపారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు ఎమ్మెల్యే కోరారు.

ఎంపీడీవో శ్రీహర్షిత్‌కు అభినందన

రైతులు నేరుగా ఆహో బ్రాండ్ ద్వారా పర్యాటకులకు, కాఫీ పౌడర్‌ను అమ్మకాలు సాగించేలా ప్రోత్సహించిన ఎంపీడీవో శ్రీహర్షిత్‌ను ఎమ్మెల్యే చెట్టి పా ల్గుణ అభినందించారు. అనంతగిరి, ఎగువశోభ పంచాయతీ రైతుల కాఫీ రైతులను సొసైటీ ఏర్పాటుకు ఎంపీడీవో కృషిని ఆయన ప్రశంసించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్, సర్పంచ్ సింహాద్రి, కాఫీ రైతులు పాల్గొన్నారు.



భీసుపురంలో తయారుచేసిన కాఫీ పౌడర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



చాపరాయికి పర్యాటకుల తాకిడి

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం వద్ద బుధవారం పర్యాటకుల సందడి నెలకొంది. మైదాన ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు. గిరి మహిళల థింసా నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. పర్యాటకులు వారితో కలిసి థింసా నృత్యం చేస్తూ సందడి చేశారు.

అనారోగ్యంతో శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రుల ఆందోళన
- సమగ్ర విచారణకు కలెక్టర్ సుమిత్‌కుమార్ హామీ



మృతిచెందిన నాలుగు నెలల మగశిశువు

సాక్షి,పాడేరు: స్థానిక జిల్లా ఆస్పత్రిలో నాలుగు నెలల మగశిశువు అనారోగ్య సమస్యలతో బుధవారం మధ్యాహ్నం మృతిచెందింది. పెదబయలు మండలం సీతగుంట గ్రామానికి చెందిన రాజేష్, ఆశ అనే తల్లిదండ్రులు అనారోగ్యంతో బాధపడుతున్న నాలుగు నెలల శిశువును జిల్లా ఆస్పత్రికి మధ్యాహ్నం 12 గంటల సమయంలో తీసుకువచ్చారు.అప్పటికే శిశువు పరిస్థితి విషమంగానే ఉంది. వెంటిలేటర్‌పై ఉంచి ఆవిరి పడుతున్న సమయంలోనే శిశువు మృతిచెందింది. తమ మగబిడ్డకు సక్రమంగా వైద్యసేవలు అందించలేదని వైద్యులు నిర్లక్ష్యమే కారణమంటూ తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.ఆస్పత్రిలో శివువు మృతదేహాన్ని తీసుకుని ఐటీడీఏ కార్యాలయం వద్ద తల్లిదండ్రులు బైఠాయించారు. ఐటీడీఏ పీవో అందుబాటులో లేకపోవడంతో అక్కడ నుంచి నేరుగా కలెక్టరేట్‌కు చేరుకుని ప్రవేశద్వారం వద్ద ఆందోళనకు దిగారు. రెండేళ్ల క్రితం ఇదే జిల్లా ఆస్పత్రిలో కాన్పు సమయంలోనే మగబిడ్డను కోల్పోయామని, వైద్యుల నిర్లక్ష్యంపై అప్పటిలోనే ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలల క్రితం మగబిడ్డ జన్మించడంతో సంతోషపడ్డామని, అల్లారుముద్దుగా పెంచుకుంటున్నామని, వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తీసుకువస్తే మళ్లీ వైద్యుల నిర్లక్ష్యంతో బిడ్డను కోల్పోయామని వారు కన్నీళ్లపర్యంతమయ్యారు. బాధ్యులైన వైద్యులు,సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్పందించిన కలెక్టర్ సుమిత్ కుమార్

కలెక్టరేట్ ఎదుట మృతిచెందిన శిశువుతో తల్లిదండ్రులు బైఠాయించిన ఘటనపై కలెక్టర్ సుమిత్ కుమార్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్ తన చాంబర్‌లో తల్లిదండ్రులను పరామర్శించారు. మృతిచెందిన శిశువును చూసి కలెక్టర్ చలించారు.శిశువు మృతి సంఘటనపై సమగ్ర విచారణ జరిపాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. బాధిత తల్లిదండ్రులకు కూడా కలెక్టర్ తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. మాతాశిశు మరణాలు నిరోధానికి జిల్లా ఆస్పత్రిలో వైద్యసేవలను విస్తృతం చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.అలాగే ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ కృష్ణారావుతో పాటు శిశువుకు వైద్యపరీక్షలు నిర్వహించిన చిన్నపిల్లల వైద్యులు గౌతమిలను కలెక్టర్ తన కార్యాలయానికి రప్పించి విచారించారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట శిశువు మృతదేహంతో ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

క్లుప్తంగా

రహదారి భద్రత వారోత్సవాలు ప్రారంభం


రహదారి భద్రత వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: రహదారి భద్రత వారోత్సవాలను జిల్లా రవాణా శాఖ ప్రారంభించింది. ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆవిష్కరించారు. ఈనెల 24వతేదీ వరకు జిల్లా వ్యాప్తంగా జరగనున్న వీటిని విజయవంతం చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా రవాణాశాఖ అధికారి లీలాప్రసాద్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

చింతూరు: ప్రయాణికులు రహదారి భద్రతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలని చింతూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆనందరావు అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాలు, స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన బుధవారం చింతూరులో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని, మితిమీరిన వేగంతో ప్రమాదాలు చోటు చేసుకుంటాయని సూచించారు.

మన పాఠశాలలు అదుర్స్..!

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 'పీఎం శ్రీ'కు అర్హత సాధించిన 678 పాఠశాలలు
- తొలి విడతలో మండలానికి రెండు స్కూళ్లు
- పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు
- క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న అధికారులు


పెదగంట్యాడ మండలం నడుపూరు జెడ్పీ స్కూల్లో రికార్డులు పరిశీలిస్తున్న అధికారుల బృందం


నడుపూరు జెడ్పీ సూల్లో రైలు బోగీ మాదిరిగా ఉన్న తరగతి గది ప్రవేశ ద్వారం వద్ద విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటలక్ష్మి

విశాఖ విద్య/పెదగంట్యాడ: ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు జాతీయ స్థాయి ప్రమాణాలతో ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకంలో చోటు దక్కించుకునేందుకు సై అంటున్నాయి. జిల్లా స్థాయి విద్యాశాఖాధికారులు ఇచ్చిన నివేదికల్లో వాస్తవికత ఎంతనేది పరిశీలన కోసం రెండు రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఉన్నతాధికారులు ఇక్కడి స్కూళ్లను చూసి శభాష్ అంటున్నారు. విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటలక్ష్మి నేతృత్వంలోని అధికారులు బుధవారం పెదగంట్యాడ, గాజువాక మండలాల్లో పర్యటించారు. నడుపూరు, గంగవరం, అక్కిరెడ్డి పాలెం జెడ్పీ హైస్కూళ్లను పరిశీలించారు. పీఎం శ్రీ పథకం అర్హత కోసమని పాఠశాల నుంచి నమోదు చేసిన వివరాల మేరకు, వాటిలో వాస్తవికత ఎంతనేది స్వయంగా చూశారు. పాఠశాల రికార్డులను పరిశీలించి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు స్వీయ పరీక్ష నిర్వహించి, విద్యాబోధనలో నాణ్యతను తెలుసుకున్నారు. నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి జరిగిన తీరును ఇక్కడి ఉపాధ్యాయులు అధికారులకు చూపించారు. రైలు బోగి మాదిరిగా ఉన్న తరగతి ప్రవేశ మార్గం వద్ద ఫొటోలు దిగారు. అందమైన పొదరిల్లు మాదిరే ఉన్న తరగతిని చూసి, బాగుందంటూ ఉపాధ్యాయులకు కితాబు ఇచ్చారు. ఎంఈవో పైడపునాయుడు అధికారులకు ఇక్కడి పరిస్థితులను వివరించారు.

అర్హత సాధించిన 678 స్కూళ్లు

పీఎం శ్రీ పథకంకు ఉమ్మడి విశాఖ జిల్లాలో 1,032 స్కూళ్లు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోగా, ఇందులో 678 జిల్లా స్థాయిలో అర్హత సాధించాయి. ఇందులో విశాఖలో 173, అనకాపల్లి -403, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 102 పాఠశాలలు జిల్లా స్థాయిలో అర్హత పొందాయి. వీటిలో మండలానికి రెండు స్కూళ్ల చొప్పున తొలివిడతలో ఎంపిక చేసే నిమిత్తం ఉన్నతాధికారుల బృందం మూడు జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తోంది.

ఎంపికైతే ప్రత్యేక నిధులు

పీఎం శ్రీ పథకంకు జిల్లా స్థాయిలో అర్హత సాధించిన స్కూళ్లలో ఉన్నతాధికారుల బృందం ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయనుంది. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా విద్యారంగం అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చూపుతున్న ప్రత్యేక శ్రద్ధతో కేంద్రం సైతం ఏపీలోని స్కూళ్ల అభివృద్ధికి ఇతోధికంగా నిధులు ఇచ్చేందుకు ముందుకొస్తోంది. ఈ నేపథ్యంలోనే అధికారుల బృందం పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తోందని పీఎం శ్రీ పథకంపై ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో పర్యవేక్షణ చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఏపీవో ఎ.శ్రీనివాసరావు తెలిపారు.

స్టాఫ్ నర్సుల ఎంపిక నిలుపుదల

- తప్పులు తడకలతో తుది జాబితా
- అన్యాయం జరిగిందని నర్సుల నిరసన
- సిబ్బందిపై అవినీతి ఆరోపణలు
- 'సాక్షి'లో కథనంతో ఉలికిపాటు
- జాబితాను మళ్లీ పరిశీలిస్తున్న అధికారులు
- అర్హులకు అన్యాయం జరగదంటున్న ఆర్డీ

మహారాణిపేట(విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ ప్రక్రియ తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఎంపిక జాబితాలో తమకు అన్యాయం జరిగిందని నిరుద్యోగ నర్సులు, వెయిటేజీ మార్కులు కలపలేదని తాత్కాలిక ఉద్యోగులు బుధవారం కూడా తన నిరసన గళం వినిపించారు. దాదాపు 30 నుంచి 40 మందికి వెయిటేజ్ మార్కులు కలపలేదని విషయం బయటకు రావడంతో.. ఈ జాబితాను పునఃపరిశీలన కోసం అధికారులు భర్తీ ప్రక్రియను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. స్టాఫ్ నర్సుల ఎంపికలో గందరగోళంపై బుధవారం 'సాక్షి'లో కథనం రావడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. తప్పుల తడకలతో కూడిన 172 మంది అభ్యర్థుల జాబితాను మళ్లీ పరిశీలన చేస్తున్నారు. కొంత మందికి అనవసరంగా ఎలా మార్కులు కలిశాయన్న దానిపై యంత్రాంగం దృష్టి పెట్టింది. అమరావతి నుంచి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది విశాఖ చేరుకుని జాబితాను పరిశీలిస్తున్నారు.

స్టాఫ్ నర్సుల పోస్టుల కోసం ఇప్పటివరకు నాలుగు సార్లు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది జాబితాను తయారు చేశారు. ప్రభుత్వం జీవో ప్రకారం జాబితా తయారు చేశామని చెబుతున్నప్పటికీ.. ఎంపికలో సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హులను తప్పించడం, అనర్హులను అందలం ఎక్కించడం కోసం సిబ్బంది చేతివాటం ప్రదర్శించారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఎంపికైన 172 మందిలో 100 మంది సర్టిఫికెట్లను మంగళవారం పరిశీలించారు. బుధవారం మరో 30 మంది సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది. జాబితాను పునఃపరిశీలన చేస్తున్న క్రమంలో ఇందులో ఎంత మంది పేర్లు ఉంటాయో.. ఊడతాయో మరి.! కాగా.. ఎంపిక జాబితా రూపొందించడంలో సిబ్బంది తీరుపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. తమ జీవితాలతో సిబ్బంది చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకసారి మార్కులు కలపడం, మరోసారి తొలగించడం, ఎంపిక జాబితాలో కొందరి పేర్లు ఇప్పుడు తొలగించడం.. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పనితీరుకు అద్దం పడుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

అభ్యర్థుల్లో ఉత్కంఠ

పోస్టుల సంఖ్య పెరగడం, కోవిడ్ సమయంలో పని చేసిన వారికి అదనపు మార్కులు కలపడం వంటి నిర్ణయాలు రావడంతో మెరిట్ లిస్ట్‌కు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఉమా సుందరి ఆధ్వర్యంలో తుది మెరుగులు దిద్దుతున్నారు. అమరావతి నుంచి వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కూడా ఇందుకు సహకారం అందిస్తున్నారు. దీంతో కొత్త జాబితా కోసం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల అభ్యర్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. కాగా..అర్హులకు అన్యాయం జరగదని డాక్టర్ ఉమా సుందరి హామీ ఇస్తున్నారు.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

సాక్షి,పాడేరు: జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి.బుధవారం ఉదయం 10గంటల వరకు పొగమంచు దట్టంగా కురిసింది. ఘాట్‌తో పాటు ప్రధాన ఆర్ అండ్‌బీ రోడ్లను మంచు తెరలు కమ్మేయడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. పాడేరు మండలం మినుములూరులో 11డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 13.9 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 14.2డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజవొమ్మంగి: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలిలావున్నాయి. మండలంలోని మండలంలోని కింద్ర గ్రామానికి చెందిన పప్పల సత్తిబాబు (57) ఈనెల 16వ తేదీ రాత్రి గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అతనిని కాకినాడ జీజీహెచ్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రైతు కూలీ అయిన సత్తిబాబు మద్యం తాగేందుకు డబ్బులు కావాలని భార్యను అడిగాడు. ఆమె లేవని చెప్పడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న గడ్డి మందు సేవించాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని వెంటనే లాగరాయి పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు మగ సంతానం ఉన్నారు.

నీటి నాణ్యత పర్యవేక్షణ ప్రాజెక్ట్ ప్రారంభం

ఏయూక్యాంపస్: సముద్ర నీటి నాణ్యతను గణించే ప్రత్యేక పరిశోధన ప్రాజెక్ట్‌ను బుధవారం ఏయూ ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోస్టల్ రీసెర్చ్‌తో సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్ నిర్వహిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సాంకేతిక పరికరం(బూయె)ను సాగర్‌తార కోస్టల్ రీసెర్చ్ వెసల్(చెన్నై) నిపుణుల బృందం ఆర్.కె బీచ్ వద్దనున్న ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న తీర ప్రాంతంలో విడిచిపెట్టింది. దీని సహాయంతో నీటి నాణ్యతను పర్యవేక్షిస్తారు. సముద్ర నీటిలో ఉష్ణోగ్రత, పీహెచ్, లవణీయత, డిజాల్వ్‌డ్ ఆక్సిజన్, క్లోరోఫిల్ వంటివి గణిస్తారు. కార్యక్రమంలో ఎన్‌సీసీఆర్ నిపుణులు డాక్టర్ పి.మిశ్రా, డాక్టర్ శివాజీ పాత్ర, డాక్టర్ బి.చరణ్‌కుమార్, ఏయూ ఆచార్యుడు డాక్టర్ పి.జానకీ రామ్ తదితరులు పాల్గొన్నారు.


సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన బూయె

21, 22 తేదీల్లో రత్నాచల్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లు పాక్షిక రద్దు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): విజయవాడ-విశాఖపట్నం సెక్షన్ రేగుపాలెం-నర్సీపట్నం స్టేషన్‌ల మధ్య జరుగుతున్న ఆధునికీకరణ పనుల నేపథ్యంలో ఈ మార్గంలో ఈనెల 21, 22 తేదీల్లో పలు రైళ్లు పాక్షికంగా, కాకినాడ మెము (17267/17268) పూర్తిగా రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. ఆ తేదీల్లో గుంటూరు-విశాఖపట్నం (17239/40) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ సామర్లకోట వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో సామర్లకోట నుంచి గుంటూరుకు చేరుకుంటుంది. ఆ రెండు రోజులు ఈ రైలు సామర్లకోట-విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించదు. విజయవాడ-విశాఖపట్నం (12718) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ తుని వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగుప్రయాణంలో తుని నుంచి విజయవాడకు చేరుకుంటుంది. ఆ రెండు రోజులు ఈ రైలు తుని-విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించదు.

20 నుంచి దూరవిద్య డిగ్రీ పరీక్షలు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో డిగ్రీ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సరం పరీక్షలకు మొత్తం 12,041 మంది దరఖాస్తు చేసుకున్నారు. 4,101 మంది విద్యార్థులు బీఏ కోర్సుకు, 3,019 మంది బీకాం కోర్సుకు, 4,921 మంది విద్యార్థులు బీఎస్సీ కోర్సుకు హాజరవుతారన్నారు.

పరీక్ష కేంద్రాల్లో స్వల్ప మార్పులు

పరీక్ష కేంద్రాల్లో స్వల్ప మార్పులు చేసినట్లు దూరవిద్య కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు తెలిపారు. నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజాం శ్రీ జీసీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో, విజయనగరం ఏజీఎల్ కళాశాల విద్యార్థులు ఎం.ఆర్ అటానమస్ కళాశాలలో, బొబ్బిలి రాజా ఆర్ఎస్ఆర్‌కె రంగారావు డిగ్రీ కళాశాల విద్యార్థులు సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, విశాఖపట్నం ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు గాజువాక టీఎస్ఆర్-టీబీకే డిగ్రీ కళాశాలలో, అమలాపురం ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, కాకినాడ రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్స్‌లో హాజరు కావాలన్నారు. వివరాలకు 0891 2844163, 2754966 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పాలిమర్స్ టెక్నాలజీలో ఉచిత కోచింగ్

ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంత యువతకు అవకాశం

అక్కిరెడ్డిపాలెం(గాజువాక): ఎన్టీపీసీ, సింహాద్రి సౌజన్యంతో భారత ప్రభుత్వ సంస్థ సీఐపీఈటీ 60 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సీఎస్‌టీఎస్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.శేఖర్ తెలిపారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో ఎన్టీపీసీ సింహాద్రి ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాల్లో స్థానికంగా ఉండి, 10వ తరగతి విద్యార్హతతో 18 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన వారు శిక్షణకు అర్హులన్నారు. ఎంపికైన వారికి విజయవాడలో ఆరు నెలల పాటు పాలిమర్స్ టెక్నాలజీలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం వారికి సర్టిఫికెట్‌తో పాటు విశాఖపట్నం, అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హోసూర్, చెన్నై తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్, అనుబంధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలతో పాటు నెలకు రూ.3 వేల స్టైఫండ్ అందిస్తామన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీయువకులు సీఐపీఈటీ ప్రతినిధి బాణావతు అంజి నాయక్ లేదా 78935 86494కు సంప్రదించవచ్చు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈ నెల 27వ తేదీలోపు పూర్తి చేసుకోవాలని శేఖర్ సూచించారు.

బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

మారేడుమిల్లి: మారేడుమిల్లి -చింతూరు ఘాట్ రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు బైకులు ఢీకొన్నాయి. ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైయ్యాయి. చింతూరు మండలం తులసిపాకలు గ్రామానికి చెందిన అబ్బాయిదొర, కిరణ్‌కుమార్ అనే ఇద్దరు వ్యక్తులు బైకుపై మారేడుమిల్లి వస్తుండగా రంపచోడవరంకు చెందిన సుబ్రహ్మణ్యం అనే యువకుడు బైకు మీద చింతూరు వెళ్తుతుండగా పాములేరు గ్రామం దాటినా తరువాత ఘాట్‌లో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కిరణ్‌కుమార్, సుబ్రమణ్యం అనే వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

21న వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం


వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఉత్సవ కరపత్రాలను విడుదల చేస్తున్న ఉత్సవకమిటీ సభ్యులు

తుమ్మపాల: పట్టణంలో ఈ నెల 21వ తేదీ శనివారం వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బొద్దపు ప్రసాద్ తెలిపారు. స్థానిక సీతారామా కల్యాణమండపంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండేళ్లు కరోనా నిబంధనల కారణంగా ఘనంగా నిర్వహించలేకపోయామని చెప్పారు. ఈ ఏడాది వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పా రు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి యడ్ల గోవింద, ఉపాధ్యక్షులు రౌతు సతీష్, దోమ రౌతు రవిశంకర్, సహాయ కార్యదర్శులు మద్దాల చిరంజీవి, కరణం గౌరీ, కోశాధికారి ఉమామహేశ్వరరావు, పెద్దలు ఎం.కూర్మారావు, శ్రీరాములు, ముత్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలి

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శాంతికుమారి ఆధ్వర్యంలో బుధవారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ ఇన్‌చార్జి, రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. పార్టీకి పూర్వవైభవంగా తీసుకురావాలన్నారు. నాయకులు చంద్రకళ, డేవిడ్, ప్రేమ్‌కుమార్, చిన్నస్వామి, మోహన్‌రావు, జగన్నాథం, భగత్‌రాం తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు రాకేష్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. శాంతికుమారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి

డిప్లొమా, బీటెక్ విద్యార్థులకు ఉపాధి శిక్షణ

రోలుగుంట: డిప్లొమా, బీటెక్ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంటు జెనరేషన్, ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా ఉచిత శిక్షణ, ఉపాధి (ఉద్యోగ)అవకాలు కల్పిస్తున్నట్టు ఎంపీడీవో కె.ప్రభాకరరావు, స్కిల్ డెవలప్‌మెంటు కోఆర్డినేటర్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. డిప్లొమా, బీటెక్ చదివిన వారికి మెకానికల్, ప్రొడెక్ట్ ఆటోమొబైల్ బ్రాంచ్‌ల్లో ఆరు నెలల పాటు అచ్యుతాపురం మండలంలోని ఎంఎస్‌ఎంఈలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. శిక్షణకాలంలో ఉచిత భోజన,వసతి సౌకర్యం కల్పించనున్నట్టు తెలిపారు. తరువాత ఉద్యోగాలు కల్పిస్తారని, ఆసక్తి ఉన్న వారు మరింత సమాచారం కోసం 9494791935 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించి, అవకాశం వినియోగించుకోవాలని వారు కోరారు.

బీసీటీని సందర్శించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

రాంబిల్లి: హరిపురంలో గల భాగవతుల చారిటబుల్ ట్రస్టు(బీసీటీ) కార్యాలయాన్ని బుధవారం రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముకేష్ కుమార్ మీనా సందర్శించారు. వినికిడి యంత్రాలు పంపిణీ చేసేందుకు నిర్వహించిన శిబిరాన్ని తొలుత సందర్శించారు. ఏపీ మెడ్‌టెక్ జోన్(విశాఖపట్నం) సహాయంతో వినికిడి యంత్రాలు అందజేస్తున్నారు. అనంతరం బీసీటీ కేవీకేను సందర్శించారు. కేవీకే నిర్వహిస్తున్న కార్యక్రమాలను శాస్త్రవేత్తలు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ భాగ్యవతి, మెడ్ టెక్ శాస్త్రవేత్తలు, అధికారులు, కేవీకే చైర్మన్ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.


కేవీకే నర్సరీని పరిశీలిస్తున్న ముకేష్‌కుమార్ మీనా

అదుపులోకి వచ్చిన డయేరియా

చినతీనార్లలో కొనసాగుతున్న వైద్య శిబిరం

నక్కపల్లి: మండలంలోని చినతీనార్లలో ప్రబలిన అతిసార(డయేరియా) అదుపులోకి వచ్చింది. వాంతులు విరేచనాలతో సుమారు 20 మంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తీవ్రంగా బాధపడేవారికి నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఏఎన్ఎం లు, ఆశావర్కర్లు మందులు పంపిణీ చేస్తున్నారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేయడం వల్ల డయేరియా అదుపులోకి వచ్చిందని డాక్టర్ కిషోర్ తెలిపారు.పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. గ్రామంలో యద్దప్రాతిపదికన క్లోరినేషన్ కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ ఆదేశించారు.

నేడు, రేపు రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడి పర్యటన

తుమ్మపాల: రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు జిల్లాలో ఈ నెల 19,20 తేదీల్లో పర్యటించనున్నట్టు జిల్లా పౌరసరఫరాల అధికారి కె.వి.ఎస్.ఎం. ప్రసాద్ తెలిపారు. జిల్లాలో అమలు జరుగుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉచిత బియ్యం పంపిణీ, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు జరుగుతున్న పోషకాహార పథకాలపై పర్యవేక్షణ, తనిఖీ చేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రధానమంత్రి మాతృవందన పథకం అమలుపై సమీక్షిస్తారని తెలిపారు.

కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షకు పటిష్ట బందోబస్తు

అనకాపల్లి ఎస్పీ గౌతమి సాలి



సాక్షి, అనకాపల్లి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు అనకాపల్లి జిల్లా ఎస్పీ గౌతమి సాలి తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 22వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రిలిమినరీ పరీక్ష జరుగుతుందని, అనకాపల్లి జిల్లాలో మొత్తం 21 సెంటర్లు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. అనకాపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 11, చోడవరంలో 5, మునగపాకలో 2, అచ్యుతాపురంలో 2, మాకవరపాలెంలో ఒక సెంటర్‌ను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. జిల్లాలో 9,897 మంది అభ్యర్థులు పరీక్ష రాయనుండగా... వీరిలో 2,781 మహిళలున్నారని, పరీక్ష రాసే అభ్యర్థులు హాల్ టికెట్‌లో సూచించే నియమనిబంధనలు పాటించాలని, ఫోన్లు, డిజిటల్ వాచ్, బ్లూటూత్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష హాల్లోకి అనుమతించరని చెప్పారు. పరీక్ష రాసే అభ్యర్థుల కోసం అనకాపల్లి, చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అనకాపల్లి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్‌గా డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం వ్యవహరిస్తున్నారని, జిల్లాలో 21 పరీక్షా కేంద్రాలకు గాను 21 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లను, 25 మంది అబ్జర్వర్ల నియమించారని తెలిపారు. పర్యవేక్షణకు అడిషనల్ ఎస్పీ (పరిపాలన) నోడల్ ఆఫీసర్ బి.విజయ భాస్కర్, నలుగురు డీఎస్పీలు, సీఐ ర్యాంకు అధికారులను నియమించినట్టు ఎస్పీ తెలిపారు.

పరీక్ష కేంద్రాల వివరాలు

అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎ, బి బ్లాకులు, దాడి వీరు నాయుడు డిగ్రీ కాలేజీ, డాక్టర్ హిమశేఖర్ డిగ్రీ కాలేజీ, హై స్కూలు, సంయుక్త డిగ్రీ కాలేజీ, సర్వేపల్లి రాధాకృష్ణ జూనియర్ కాలేజీ, శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం హై స్కూల్, భాష్యం ఇంగ్లిష్ మీడియం హై స్కూల్, కె.ఎస్.ఆర్.ఎం సిటీ ఇంగ్లిష్ మీడియం హై స్కూల్, శ్రీ కన్య జూనియర్ కాలేజీ, చోడవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉషోదయ జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ, శ్రీ సాయి ప్రకాష్ డిగ్రీ కాలేజీ, శ్రీ షిర్డీ సాయి శ్రీనివాస్ డిగ్రీ కాలేజీ, విద్యార్థి డిగ్రీ కాలేజీ, మునగపాక పోలీస్ స్టేషన్ పరిధిలో డావెన్సీ ఇంటర్నేషనల్ స్కూల్, ఎమ్మెస్సార్ నేషనల్ డిగ్రీ కాలేజీ, అచ్యుతాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో కైట్స్ జూనియర్ కాలేజీ, ప్రశాంతి పాలిటెక్నిక్ కాలేజీ, మాకవరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో పరీక్షలు నిర్వహించనున్నారు.